క్లుప్తంగా

ఘనంగా ఉరుసు మహోత్సవం


జయ్యద్ బాయజీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముజావర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ దర్గాలో ఉరుసు కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. శనివారం ఉదయం, సాయంత్రం సయ్యద్ బాయజీద్ మహత్ముని నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. తొలుత ఖురాన్ పఠనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలీ కార్యక్రమం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఈ కార్యక్రమంలో మేయర్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా వంశపారంపర్య ముజావర్లు షేక్ హుస్సేన్, షేక్ సాబీర్ హుస్సేన్, షేక్ షబ్బీర్ హుస్సేన్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి కాపులకు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల నుంచి శాసనమండలికి జరిగే ఎన్నికల్లో ఉన్న రెండు స్థానాల్లో ఒకటి కాపులకు కేటాయించాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు కోరారు. గోదావరి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉన్న కాపులకు న్యాయం చేయాలన్నారు. ఇటీవల కాలంలో కాపు సామాజిక వర్గాలు ప్రతినిధులు ఉన్న చోట్ల కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగా అసమ్మతి పేరుతో వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ చర్యల ద్వారా కాపు సామాజిక వర్గానికి అన్యాయం చేయాలనే ఆలోచన కనిపిస్తుందన్నారు. ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి కాపులకు ఇవ్వడం ద్వారా తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాల్సిందిగా పులి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు.

నేడు ఏఐటీయూసీ జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం

ఏలూరు (టూటౌన్) : ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం ఈ నెల 19వ తేదీన ఏలూరులో జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలియజేసారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్ నందు ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుపనున్నట్లుగా ఆయన తెలియజేసారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, అతిథిగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పాల్గొంటారని తెలిపారు.

సర్వం శివమయం

- నగరంలో మిన్నంటిన శివనామస్మరణ
- తెల్లవారుజాము నుంచి భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకాలు
- శివయ్య దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలో శివనామ స్మరణ మిన్నంటింది. నగరంలోని పలు శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లకు విశేష అలంకరణలు చేశారు. రాత్రి ఆయా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకోవడానికి వివిధ శైవక్షేత్రాల్లో భక్తులు పోటెత్తారు. స్థానిక పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6.48 గంటలకు శివజ్యోతి కార్యక్రమం అనంతరం స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొడమంచిలి లక్ష్మణ రావు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

అగ్రహారంలో..

స్థానిక అగ్రహారంలోని శ్రీ గంగా, వింధ్యవాసినీ సమేత నగరేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారు జాము 4 గంటల నుంచి 8 గంటల వరకూ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి మల్లిఖార్జున రావు ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి రామపెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పవర్‌పేటలో..

స్థానిక పవర్‌పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు పంచామృతాలతో, పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానంద శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

దొండపాడులో..

స్థానిక దొండపాడు నందత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి అహోరాత్ర మహాశివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీ కల్యాణం, లక్ష బిల్వార్చన , రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకూ భజన, దివ్యనామ సంకీర్తన, జాగరణ కార్యక్రమాలు నిర్వహించారు. వీటితో పాటు స్థానిక దక్షిణపు వీధిలోని శ్రీ జలాపహరేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేటలోని శ్రీ పర్వత వర్ధని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లో సైతం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.


విశేష అలంకరణలో పత్తేబాద శ్రీ రామలింగేశ్వర స్వామి


పవర్‌పేట శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


ఆదివారపు పేటలో రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చక స్వాములు


నగరేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు


దొండపాడులో నందత్తనాథ క్షేత్రంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్) : ఆది ఆంధ్ర ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డి వర్మ 84వ వర్ధంతి సందర్భంగా స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి సంఘ సంస్కర్తగా, ఆది ఆంధ్ర ఉద్యమ మహాసభకు విజయవాడలో సభాధ్యక్షునిగా ఉన్నారన్నారు. 1906–1933 మధ్యకాలంలో హైదరాబాద్ సంస్థానంలో పేద బాలికల కొరకు పాఠశాలలు స్థాపించారన్నారు. జగన్మాత మండలి సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సంమాజం వంటి అనేక సంఘాలను స్థాపించి పుట్టుకతో మనుషులందరూ సమానమే అని పోరాటం చేసిన దీన జన భాంధవుడు భాగ్యరెడ్డివర్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఏవైఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పల్లా యేసేబు, కె.బాబూరావు, జి.నాగేశ్వరరావు, కె.కోటి తదితరులు పాల్గొన్నారు.


భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సంధర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాతపాటి సర్రాజు మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు మరణం పట్ల కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. సర్రాజు మంచితనానికి, బోళా బోళీ తనానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. గతంలో జిల్లా కాంగ్రెస్ కమిటీలో సర్రాజుతో కలిసి పనిచేసిన సంధర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఆదర్శవంతుడైన నేతగా జీవితాన్ని గడిపిన సర్రాజు మరణం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు తీరని లోటుగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్రాజు కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు.

20న మాదేపల్లిలో మాతృభాషా దినోత్సవం

ఏలూరు రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 20వ తేదిన ఏలూరు మండలం మాదేపల్లి జడ్పీ పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించనున్నామని హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేపట్టనున్న తెలుగు, కన్నడ, మహయాళం తదితర భాషాల్లో అనువాధం, హింధిలో ఉపసర్గలు గుర్తించడం, ఇంగ్లీషులో కర్మవాచ్యాలకు కర్మ వాచ్యాలు చెప్పడం తదితర పోటీల్లో బాలబాలికలు పాల్గొంటారని వివరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	20
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	28
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12
బెండకాయలు	40	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	28
కాకర కాయలు	22–28	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	12
క్యారెట్	24	పాలకూర	08
దొండకాయలు	28	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	34–44	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	54
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	20

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	08
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	11
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	16
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	09
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	25
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

నిర్మాణంలో 190 వైఎస్సార్ జలకళ బోర్లు

దెందులూరు : మండలంలోని 17 గ్రామ పంచాయతీ శివారు ప్రాంతాల్లో 190 వైఎస్సార్ జలకళ బోర్లు నిర్మాణంలో ఉన్నాయని దెందులూరు మండల ఉపాధి పథకం ఏపీఓ దశరథ రాంజీ అన్నారు. శనివారం ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా రైతుల సాగు అవసరాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ జలకళ పథకం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నూతనంగా 102 జలకళ బోర్ల మంజూరుకు దరఖాస్తులు వచ్చాయని, పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

పట్టు పరిశ్రమ పెంపకం షెడ్ల మంజూరు


రామారావుగూడెంలో సాగులో ఉన్న పట్టు పరిశ్రమల పెంపకం షెడ్డు

దెందులూరు : మండలంలో 11 కొత్త పట్టు పరిశ్రమ పెంపక షెడ్లు మంజూరయ్యాయని పట్టు పరిశ్రమల శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ జీ.రత్తయ్య తెలిపారు. శనివారం రామారావుగూడెం, మేధినరావుపాలెం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న షెడ్లను ఆయన పరిశీలించారు. సాగు రైతులను షెడ్లల్లో లోపాలు, వ్యాధులు అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దెందులూరు మండలంలో 100 ఎకరాల్లో పట్టు పరిశ్రమల షెడ్ల పెంపకం రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఎస్సీలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల 60 వేలు నూరు శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఓసీ, బీసీలకు 90 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. గత మూడేళ్లల్లో మెట్ట గ్రామాల్లో పట్టు పరిశ్రమల షెడ్ల ద్వారా సాగు చేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు.

వైభవంగా రామకోటి ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌన ధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీపురం ఆర్వీ సుబ్రహ్మణ్యం దంపతులచే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వమించారు. ఈ సందర్బంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 4.30 గంటల నుంచి శివపార్వతుల కల్యాణ మహోత్సవం నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వర రావు దంపుతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు మాడా రామారావు దంపతుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 8.30 గంటల నుంచి నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి పార్వతి రామచంద్రన్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను అకట్టుకున్నాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.


శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వర రావు దంపతులు

బలివే క్షేత్రం.. భక్తజనసంద్రం


బలివే రామలింగేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఇతర నాయకులు


అన్నప్రసాద కార్యక్రమాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ


తమ్మిలేరులో స్నానం చేస్తున్న భక్తులు

పెదవేగి : మహాశివరాత్రి పర్వదినాన ప్రముఖ పుణ్యక్షేత్రం బలివే రామలింగేశ్వర స్వామిక్షేత్రం భక్తసంద్రమైంది. సుమారు 3 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించి తరించారు. శనివారం తెల్లవారుజామునుంచే ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి అరుణభాస్కరరావు, అమర్ బలివే రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి గంటల తరబడి క్యూ కట్టారు. ఆలయానికి విచ్చేసిన భక్తజనం తమ కుటుంబంలో మరణించినవారికి పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మహాశివరాత్రి మూడు లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి సి.జయప్రకాష్ తెలిపారు. ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి దంపతులు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణతో కలిసి బలివే రామస్వామిని దర్శించి పూజలు చేశారు. బలివే ఉత్సవాలకు వచ్చిన భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతులమీదుగా భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. సుమారు 50 వేల మందికి ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు పులిహోర, చక్రపొంగలి, మజ్జిగ, మంచినీరు అందజేశారు. అతిధిగా విచ్చేసిన కొఠారు దంపతులను దేవస్థాన నిర్వాహకులు దుశ్శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు. దూర ప్రాంతాల నుంచి బలివేకి విచ్చేస్తున్న భక్తులకు మార్గమధ్యలో యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉచితంగా, మజ్జిగ, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొని భక్తులకు సేవలందించారు.


స్వామివారి దర్శనానికి ఆలయం వద్ద భక్తుల క్యూ


బలివే తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ


భక్తుల కోసం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఏర్పాటు చేసిన ఉచిత భోజన శిబిరం

సాయి దివ్య రథంతో ద్వారకాతిరుమల క్షేత్రానికి


ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంటున్న సాయి దివ్యరథం

ద్వారకాతిరుమల: ఏలూరులోని తూర్పువీధి శ్రీ శిరిడీ సాయి మందిరం నుంచి సుమారు 10 వేల మంది భక్తులు శనివారం చినవెంకన్న దివ్య క్షేత్రానికి పాద యాత్రగా విచ్చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా వారంతా ఇలా క్షేత్రానికి వస్తున్నారు. ఈ క్రమంలోనే ఉదయం ఏలూరులోని ఆలయం వద్ద నుంచి రథంతో ప్రారంభమైన వారి పాదయాత్ర సాయంత్రానికి క్షేత్రానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాబా సంకీర్తనల నడుమ రథాన్ని లాగుతూ భక్తులు.. ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత రథాన్ని స్వామివారి పాదుకామండపం వద్ద ఉంచి, విశేష పూజలు జరిపి, బాబా గీతాలాపనలు చేశారు. అనంతరం వారంతా శ్రీవారు, అమ్మవార్లను దర్శించారు. పాదయాత్ర భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఇదిలా ఉంటే దారిపొడవున భక్తులకు పలువురు దాతలు మజ్జిగ, మంచినీరు, అల్పాహారం, పండ్లను వితరణ చేశారు.

తపన ఆధ్వర్యంలో ప్రసాద వితరణ

పెదవేగి : మహాశివరాత్రి సందర్భంగా తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలోని పలు శైవ క్షేత్రాల వద్ద భక్తులకు పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు. విజయరాయి, బలివేతోపాటు పట్టిసీమ, తాడువాయి, వెలేరుపాడు, కలిదిండి మండలం భోగేశ్వరం గ్రామలలోని శైవ క్షేత్రాల వద్ద భక్తులకు ప్రసాద వితరణతోపాటు భక్తులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను అందించినట్లు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి చౌదరి తెలిపారు. సుమారు 50 వేల మందికి ప్రసాద వితరణ, మజ్జిగ, మంచినీటిని అందించడం సంతోషంగా ఉందన్నారు.

ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలి

దెందులూరు : మండలంలోని మెట్టగ్రామాల్లో తొమ్మిది గ్రామాలకు మధ్యలో ఉన్న మేధినరావుపాలెం గ్రామంలో ఏటీఎం సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఏటీఎం లేకపోవడంతో సమీపంలోని దెందులూరు, భీమడోలు గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో సమయం వృథా అవుతుందోని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.